సాక్షి మంచిర్యాల

శనివారం ౹ 2 ౹ నవంబర్ ౹ 2024



గృహ నిర్బంధంలో అఘోరీ

గత కొన్ని రోజులు సంచలనాలకు కేంద్రంగా మారిన అఘోరీని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆత్మార్పణ ప్రకటన నేపథ్యంలో కుశ్న పల్లిలో తల్లిదండ్రులకు అప్పగించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 31.0 /23.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.



దండేపల్లిలో చిచ్చుబుడ్డి కాలుస్తున్న యువకులు



దీపాలు వెలిగిస్తున్న యువతి



దుకాణంలో పూజలు



కాకరవత్తులు కాలుస్తున్న కుటుంబం

ఘనంగా దీపావళి

దీపావళి పండుగను జిల్లా ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వ్యాపార దుకాణాలు, ఇళ్లను మామిడి, అరటి ఆకులు, బంతిపూలతో అలంకరించారు. సాయంత్రం వేళ రంగు రంగుల విద్యుత్‌దీపాలు, ప్రమిదలు వెలిగించి లక్ష్మీదేవి పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు అందరూ కలిసి బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. - 9లో

న్యూస్‌రీల్

సింగరేణిలో జీఎంలు బదిలీ

- శ్రీరాంపూర్ జీఎంగా ఎల్వీ సూర్య నారాయణ



ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణిలో పలువురు జీఎంలను బదిలీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి గత నెల 31న ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఆర్జీ 2 ఏరియా జీఎం ఎల్వీ సూర్య నారాయణను ఇక్కడికి బదిలీ చేశారు. భూపాలపల్లి జీఎం ఎస్డీ.హబీబ్ హుస్సేన్‌ను జీఎం(హెచ్‌ఆర్డీ) కార్పొరేట్‌కు, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత సహానుబెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎంగా, కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎం బీ.వెంకటయ్యను ఆర్జీ 2 ఏరియా జీఎంగా బదిలీ చేశారు. కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం కే.శ్రీనివాసరావును జీఎం(పర్సనల్, వెల్ఫేర్)గా, నైనీ బ్లాక్ ఏజీఎం సుజయ్ ముంజుందర్‌ను నైనా బ్లాక్ ఓఎస్డీగా బదిలీ చేశారు. కొందరికి పదోన్నతులు కూడా కల్పించారు. వీరిలో మందమర్రి ఏరియా ఎస్ఓ టు జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డిని భూపాలపల్లి జీఎంగా, కార్పొరేట్‌లోని హెచ్‌ఆర్డీలో ఏజీఎం చందన లక్ష్మీ నారాయణను కార్పొరేట్ జీఎంగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఆర్జీ 3 ఏరియా ఓసీపీ 1 పీఓ యన్.రాధాకృష్ణను కార్పొరేట్ ఎస్టేట్స్‌కు, బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంబీబీఎస్ విద్యకు ఆర్థిక సాయం అందించండి

- ఎమ్మెల్యేకు గిరిజన విద్యార్థిని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న శిరీష

బెల్లంపల్లి: ఎంబీబీఎస్ విద్య అభ్యసించడానికి ఆర్థిక సాయం అందించాలని గిరిజన విద్యార్థిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను వేడుకుంది. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఆదివాసీ, కొలవార్ సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసింది. కన్నెపల్లి మండలం తాళ్ల రెబ్బెన గ్రామానికి చెందిన ఆదివాసీ కొలవార్ గిరిజనుడైన మానేపల్లి లక్ష్మి, పెంటయ్య దంపతుల కూతురు శిరీష కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు లభించింది. పేదరికంలో తల్లిదండ్రులు ప్రథమ సంవత్సరం ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉండడంతో చదువుకు దూరమయ్యే ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆధ్వర్యంలో శిరీష, కుటుంబ సభ్యులు, నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్థిక తోడ్పాటు అందించి చదువు కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు. శిరీషకు ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరి కృష్ణ, ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్స గోపాల్, జిల్లా అధ్యక్షుడు కమ్మరి భీమయ్య, నాయకులు భీమేష్, రఘు, నాయిని స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘నేధాని పదాన్ని సవరించాలి’

జన్నారం: ప్రభుత్వ గెజిట్‌లో సీరియల్ నంబర్ 40లో నేతకాని కులానికి బదులుగా నేధానిగా పడిందని, ఈ అచ్చు తప్పు పదాన్ని సవరించి నేతకాని కులస్తులకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో న్యాయం జరిగేలా చూడాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రాల్లో తహసీల్దార్ కార్యాలయంలో నేతకాని అని సర్టిఫికెట్లు అందజేస్తున్నారని, గెజిట్‌లో మాత్రం ఉన్న ఈ నేధాని తప్పు పదాన్ని తొలగించాలని తెలిపారు. నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుదాస్, జాడి గంగాధర్, మండల నాయకులు మాణిక్యం, జాడి వెంకట్, స్వామి, ప్రేంకుమార్, శేఖర్, శ్రీనివాస్, శ్రీధర్, మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఊరట



హాజీపూర్ మండలం గుడిపేట గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంబురాలు

- డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు
- సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో అమలుకు ప్రభుత్వం నిర్ణయం

మంచిర్యాలఅర్బన్: సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు విద్యార్థులకు ఊరటనిస్తోంది. పౌష్టికాహారం అందించేందుకు ఆహార పట్టిక రూపొందించడం, అమలుపై దృష్టి సారిస్తే ఎంతో మేలు జరుగుతుంది. చార్జీల పెంపునకు ప్రభుత్వం ఆమోదించడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో టీఎస్‌ఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లలో 533 మంది విద్యార్థులు, నాలుగు మైనార్టీ వెల్ఫేర్ స్కూళ్లలో 922మంది, ఎనిమిది ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ స్కూళ్లలో 3,087, తొమ్మిది టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లలో 4,373మంది విద్యార్థులు చదువుతున్నారు. 16 ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, రెండు పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 3,249 మంది విద్యార్థులు, 23 ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్‌లో 2,430మంది, బీసీ వసతిగృహాలు పోస్టుమెట్రిక్-8లో 897మంది, ప్రీమెట్రిక్-8లో 748మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

చార్జీల పెంపు ఇలా..

3నుంచి 7వ తరగతి విద్యార్థులకు ప్రస్తుతం రూ.950 ఉండగా.. రూ.1,330కి, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,100 ఉండగా రూ.1540కి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ.1500 ఉండగా రూ.2,100కు డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాస్మోటిక్ చార్జీలు 3నుంచి 7వ తరగతి విద్యార్థినులకు రూ.55 చెల్లిస్తుండగా రూ.175కు, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.75 చెల్లిస్తుండగా రూ.275కు పెంచారు. విద్యార్థులకు 3నుంచి 7వ తరగతి వరకు రూ.62నుంచి రూ.150కి, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.62 నుంచి రూ.200కు, కళాశాల విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100 వరకు పెంచారు.

ధరలతో సతమతం..

మార్కెట్‌లో ధరలు, డైట్ చార్జీల చెల్లింపుల్లో వ్యత్యాసంతో విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో కోత పడుతోంది. గురుకులాలు, వసతిగృహాల్లో నిర్వాహకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం చెల్లించే డైట్ చార్జీలతో మెనూ ఎలా అమలు చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కూరగాయలు కిలోకు రూ.25 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.60లోపు ధరలు ఉన్న సందర్భాలు తక్కువే. డైట్ చార్జీలు తక్కువ చెల్లించడంతో పిల్లలకు ఇచ్చే గ్రాముల్లో ఆహారం తగ్గించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. చిక్కటి పప్పు కాస్త పలుచగా మారుతోంది. వారంలో ప్రతీ రోజు కోడిగుడ్లు, అరటిపండ్లు, రెండ్రోజులు చికెన్‌తో భోజనం అందించాల్సి ఉంటుంది. కానీ మూడు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు అరటిపండ్లతో సరిపెడుతున్నారు. వారం ఒక రోజు మాత్రమే చికెన్‌కు మెనూ మార్చారు. ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీల నేపథ్యంలో ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో మెనూ పట్టిక తయారు చేశారు. ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులకు ఐదు రోజులు కోడిగుడ్లతోపాటు అరటిపండు అందించాలని ఆహార పట్టిక రూపొందించినట్లు తెలుస్తోంది. చార్జీల పెంపుతో జిల్లాలో కూడా అన్ని వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు మెనూలో మార్పులు చేసి కడుపునిండా భోజనం అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలి.

కాస్మోటిక్ చార్జీలు

విద్యార్థులకు చెల్లించే కాస్మోటిక్ చార్జీలు పెరిగాయి. గతంలో రూ.62 మాత్రమే చెల్లిస్తుండగా తరగతులను బట్టి రూ.150 నుంచి రూ.275కు పెంచారు. గతంలో చెల్లించే చార్జీల్లో విద్యార్థి కటింగ్ కోసం రూ.12 చెల్లించగా మిగతా డబ్బుతో సబ్బులు, నూనె తదితర కొనుగోలుకు రూ.50 ఏమాత్రం సరిపోయేవి కావు. చిన్న పిల్లలకు కటింగ్ కోసం రూ.50 లేనిదే కత్తెర వేయని పరిస్థితి. విద్యార్థినుల కాస్మోటిక్ చార్జీలు అంతంత మాత్రంగానే ఉండడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తరగతులను బట్టి రూ.55నుంచి రూ. 75వరకు చెల్లిస్తూ వచ్చారు. ఇందులోనే న్యాప్‌కిన్లతోపాటు సబ్బులు, హెయిర్ ఆయిల్‌బాటిల్, షాంపోబాటిల్, పౌడర్, టూత్‌పేస్ట్, దువ్వెన, జడ క్లిప్పులు, రిబ్బన్లు, బొట్టు బిళ్లలు ఇలా అవసరమైన వాటిని కొనుగోలు చేయడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం 3నుంచి 7వ తరగతికి రూ.175, ఎనిమిది నుంచి 10వ తరగతి వరకు రూ.275 వరకు పెంచడంతో ఊరటనిస్తోంది. డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై విధివిధానాలు రావాల్సి ఉంది.

గురుకులంలో సంబరాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా చాలీచాలనీ మెస్ చార్జీలతో ప్రిన్సిపాల్, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం లభించే అవకాశం ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి



పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీ



బెటాలియన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: భారతదేశ మొట్టమొదటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను రామగుండం కమిషనరేట్ ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీ శ్రీనివాసులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఐకమత్యాన్ని, దేశ సమగ్రతను కాపాడతానని పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి(జాతీయ ఐక్యత దినోత్సవం) వేడుకలు హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సమైక్యతను ప్రదర్శించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులు పోలీసు శాఖలో అంతర్భాగం

మంచిర్యాలక్రైం: హోంగార్డుల విభాగం పోలీసుశాఖలో అంతర్భాగమేనని సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. రామగుండం కమిషనరేట్ ఆవరణలో గురువారం హోంగార్డులు, ఏఆర్, స్పెషల్‌పార్టీ, వివిధ విభాగాల్లోని పోలీసు అధికారులతో దర్బార్ నిర్వహించారు. ప్రతీ ఒక్కరిని వారి వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, ఉన్నతాధికారులు వేధింపులు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

సమర్థవంతంగా కుటుంబ సర్వే

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్



రాపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో కార్యదర్శులకు కుటుంబ సర్వే శిక్షణ, ఫారంల పంపిణీ, సర్వే వివరాలు, ఇళ్లకు స్టిక్కర్ అతికించే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. రాపల్లి గ్రామంలో సర్వేను పరిశీలించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అన్ని అంశాలపై ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టినట్లు తెలిపారు. సిబ్బందికి కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం నిర్ణీత నమూనాలో కుటుంబ వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. ప్రతీ 10 ఎన్యుమరేషన్ బ్లాక్‌లకు డేటా సేకరణ పర్యవేక్షణకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి ఎన్యుమరేటర్ సేకరించిన వివరాలతో 10శాతం రాండమ్ కుటుంబాలను ఎంపిక చేసుకుని ఆ ఇళ్లను సందర్శించి పునఃపరిశీలిస్తామని తెలిపారు. వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటించాలని, కేటాయించిన బ్లాక్‌లో అన్ని కుటుంబాలను కచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఇంటి నంబర్, యజమాని పేరు, ఇతర వివరాలు సేకరించిన అనంతరం స్టిక్కర్‌ను వారి ఇంటి గోడపై అతికించాలని అన్నారు. ఎన్యుమరేటర్ల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస రావుదేశ్‌పాండే, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ ఉమర్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీ దండారీలకు ఆర్థికసాయం



ఎమ్మెల్యే వినోద్‌తో కలిసి చెక్కులు చూపిస్తున్న ఆదివాసీలు

బెల్లంపల్లి: దండారీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సాయం చెక్కులను శుక్రవారం స్థానిక ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ దండారీ నిర్వాహకులైన ఆదివాసీలకు పంపిణీ చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని 17దండారీలకు రూ.15వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో మడావి గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రదీప్, ఆదివాసీ నాయకులు అడ జంగు, సోయం సూరు, ఆత్రం జంగు, గ్రామ పటేళ్లు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్: సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా వాటిని కొనసాగించి, నేటి తరానికి తెలియజేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో నిర్వహించే దండారీ ఉత్సవాల కోసం రూ.15 వేల చొప్పున రూ.75 వేల విలువైన చెక్కులను గ్రామస్తులకు శుక్రవారం తన నివాసంలో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగారాం, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముల్కల్లలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల, పెద్దంపేట, దొనబండ గ్రామాల్లో రూ.4.50 కోట్లతో లో లెవెల్, హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ హాజీపూర్ మండలంలోని గ్రామీణ రోడ్లను రెండేళ్లలో పూర్తి చేసి విద్య, వైద్యం, రవాణా పరంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హాజీపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన సేవలు

మంచిర్యాలటౌన్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. క్రిటికల్ కేర్ 50 పడకలతో ఏర్పాటుకు ఆమోదం వచ్చిందని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాత ఆలోచన అదిరింది..



గడ్డి మందు స్ప్రే చేస్తున్న కూలీలు

వేమనపల్లి: ప్రాణహిత వరదలతో ఖరీఫ్‌లో విత్తిన పత్తి పంట మునిగిపోగా ప్రత్యామ్నాయంగా మళ్లీ పత్తి పంట విత్తుకున్న రైతుకు కలుపు బెడద ఎక్కువైంది. దీంతో కలుపు నివారణకు అన్నదాత వినూత్న ఆలోచన చేశాడు. మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం వేమనపల్లి శివారులో తొమ్మిది ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. పంట గతంలో వరద పాలైంది. 20 రోజుల క్రితం మళ్లీ పత్తి విత్తనం నాటాడు. మొక్కలు చిన్న దశలో ఉండగా కలుపు సమస్య పెరిగిపోయింది. దీంతో కలుపుతీతకు కూలీల ఖర్చు పెరుగుతుండడంతో ఉపాయం ఆలోచించాడు. పత్తి మొక్కపై కూలీలతో డిస్పోజల్ గ్లాసులు బోర్లించి చార్జింగ్ పంపులతో గడ్డి మందు స్ప్రే చేయిస్తున్నాడు. దీంతో మొక్కపై గడ్డి మందు పడకుండా జాగ్రత్త పడుతున్నాడు. ఎకరానికి రూ.8 వేలు కలుపునకు ఖర్చు అయ్యేదని ఈ ఉపాయంతో రూ.1500తో కలుపు నివారణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రయోగంతో పొలంలో కలుపు బెడద తగ్గింది.

పర్యాటక ప్రాంతంగా గాంధారి వనం

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



వనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: గాంధారి వనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. చక్కటి చెట్లతో సహజసిద్ధంగా ఉన్న ఈ ఎకో పార్కును కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉంటుందని తెలిపారు. మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశీష్‌సింగ్‌తో కలిసి గురువారం బొక్కలగుట్ట గాంధారి వనాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న గాంధారి వనాన్ని అభివృద్ధి చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వనంలో ఓపెన్‌జిమ్, మరుగుదొడ్లు, రామకృష్ణాపూర్ వైపు నుంచి వచ్చే వాకర్స్ కోసం ఓ గేటు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం కొత్త తిమ్మాపూర్‌లోని షేడ్ కేంద్రంలో రెవరెండ్ థామస్ నెల్యానికి నిర్వహించిన పట్టాభిషేకం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి, అబ్దుల్‌అజీజ్, గోపతి రాజయ్య, శ్యాంగౌడ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దండారీ ఉత్సవాలు



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి నది ఒడ్డున ఉన్న పద్మల్‌పూరి కాకో ఆలయంలో దసరా పండుగతో మొదలైన దండారీ ఉత్సవాలు గురువారం దీపావళి పండుగతో ముగిశాయి. దండారీ వేడుకలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాకోను దర్శించుకున్నారు. గుస్సాడీల నృత్యాలు, ఎంతగానో అలరించాయి. దండారీ ఉత్సవాలతో కాకో ఆలయం వద్ద పదిహేను రోజులపాటు సందడి కనిపించింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం దస్తురాబాద్ మండలం దేవునిగూడెం గ్రామానికి చెందిన ఎర్సని సతీశ్, మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై పాండ్వపూర్ నుంచి కడెం వెళ్తున్నారు. మార్గమధ్యలో చెక్‌పోస్ట్ వద్ద బైక్ అదుపుతప్పి బారికేడ్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో సతీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

కారు-బైకు ఢీ.. ఒకరికి గాయాలు

ముథోల్: మండల కేంద్రం ముథోల్‌లోని స్థానిక కంటి ఆస్పత్రి పక్కన కారుబైక్ గురువారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. మండల కేంద్రం గురుకుల బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి ఉదయం విధులకు వెళ్తుండగా కంటి ఆస్పత్రి సమీపంలో బాసర వైపు నుంచి భైంసాకు వెళ్తున్న కారు ఢీట్టింది. ఈ ఘటనలో పోశెట్టికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించి స్థానికులు, కంటి ఆస్పత్రి సిబ్బంది 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుడి భుజం విరిగినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రాణహితలో పడి యువకుడు గల్లంతు


తేజస్‌రాజు (ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద ప్రాణహిత నదిలో మహారాష్ట్రలోని అహేరికి చెందిన తేజస్‌రాజు బొమ్మవార్ అనే యువకుడు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం అహేరికి చెందిన ఓ కుటుంబం నదిలో స్నానం చేయడానికి గూడెం అవతలి వైపు ప్రాణహిత నది ఒడ్డుకు వచ్చారు. నదిలో నీటి మట్టంపై అంచనా లేకపోవడంతో స్నానం చేయడానికి నదిలోకి దిగిన కాసేపటికే తేజస్ మునిగిపోయాడు. కుటుంబసభ్యుల చూస్తుండగానే నదిలో ప్రవాహంలో చిక్కుకుపోయి గల్లంతయ్యాడు. మహారాష్ట్ర పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆవులను గాయపర్చిన వ్యక్తిపై కేసు

దహెగాం(సిర్పూర్): మండలంలోని ఐనం గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన ఆవులను గొడ్డలితో గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చల్లూరి కై లాశ్, దుర్గం మల్లయ్యకు చెందిన రెండు ఆవులు అదే గ్రామానికి చెందిన వెల్ములే బాపురావ్ చేనులో పంట మేశాయి. బాపురావ్ గొడ్డలితో ఆవులను తీవ్రంగా గాయపరిచాడు. చల్లూరి కైలాశ్ ఫిర్యాదు మేరకు బాపురావ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గురువారం బాపురావ్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తుండగా మద్యంమత్తులో స్పృహ తప్పి పడిపోయాడన్నారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించామని పేర్కొన్నారు. కాగా.. పోలీసులు చిత్రహింసలు పెడితేనే బాపురావ్ స్పృహ తప్పి పడిపోయాడని అతడి భార్య ఆరోపించింది. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బాపురావ్‌ను ఎలాంటి చిత్రహింసలకు గురిచేయలేదని ఎస్సై స్పష్టం చేశారు. ఆస్పత్రి నుంచి శుక్రవారం డిశ్చార్జీ అయినట్లు తెలిపారు.

కార్తీక మాసం.. పరమపవిత్రం..!

- దీపోత్సవాలకు ఆలయాలు సిద్ధం
- స్నాన, జప, ఉపవాసాలతో జీవనశైలి మెరుగు
- నేటి నుంచి ఆలయాల్లో 'కార్తీక' సందడి


ముస్తాబైన శివాలయం

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్: కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసం హరిహరులకు ప్రీతిపాత్రమైన నెలగా భక్తులు విశ్వసిస్తారు. వేకువజామున స్నానాలు ఆచరించి దీపాలను వదలడం వెనుక గొప్ప ఆరోగ్య సూత్రం ఉందని భావిస్తుంటారు. స్నాన, దాన, జప, పూజ, ఉపవాస, దీపారాధన, వన భోజనాలు వంటివి చేయడం ద్వారా జన్మజన్మల పాపాలను ప్రక్షాళన చేసి అనంతమైన పుణ్యాలను పొందవచ్చని భక్తుల నమ్మకం. శైవక్షేత్రాలు, గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ మాసంలో గంగానది స్నానం చేయడం ఉత్తమైందని భావిస్తారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరిస్తారు. శివాలయాలు, వైష్ణవ ఆలయాల వద్ద ఆకాశ దీపాలను ఏర్పాటు చేస్తారు. కార్తీకమాసంలో దీప దానం చేయాలన్నది శాస్త్రవచనం. కార్తీక మాసంలో సూర్యోదయానికి ముందు చన్నీటితో స్నానం ఎంతో ఆరోగ్యదాయకం. ఉసిరిక చెట్టును శ్రీమహవిష్ణువుగా, లక్ష్మీ ప్రదంగా భావించాలని ఉంది. ఈ అత్యంత ప్రీతిపాత్రమైన ఉసిరిక చెట్టుకింద వనభోజనం చేస్తారు.

దీపారాధన..

కార్తీక మాసంలో శివాలయం, ఇంట్లో గానీ ప్రాతఃకాలం, సాయకాలం దీపారాధన చేస్తారు. దీపం, బంగారం, నవధాన్యాలు, అన్నం, మంచం దానమిస్తే స్త్రీలకు ఐదోతనం వృద్ధి అవుతుందని, సౌభాగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. సూర్యాస్తమయంలోగా సంధ్యాదీపం వెలిగించడం, ముగ్గుపెట్టడం, ఇంటి ముందు దీపం, తులసీ కోటాలో దీపాన్ని పెట్టడం తులసీ, పూజ, గౌరీ పూజ చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని నమ్ముతారు.

ఉసిరి చెట్టు ప్రదక్షిణలకు ప్రత్యేకత

కార్తీక మాసంలో దాత్రీ నారాయణుడిని కొలవడం ఆనవాయితీగా వస్తోంది. దాత్రీ నారాయణుడంటే ఉసిరిక చెట్టు, మూలికాశాస్త్రంలో అద్భుత శక్తి గల వృక్షంగా ఉసిరిక చెట్టుకు పేరుంది. చెట్టు ప్రాంతంలో పూజలు, ప్రదక్షిణలు చే యడంతో చెట్టుగాలిలోని సీ విటమిన్ శరీరా నికి లభిస్తుంది. ఆవు నెయ్యితో వెలిగించిన దీపంతో ఆ కిరణాలు శరీరానికి తాకి చైతన్యవంతమై న కాంతులు వెదజల్లుతాయని చెబుతుంటారు. చెన్నూర్ శివాలయంలో ఆగస్త్య మహా ముని పూజలు చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించారని ప్రచారంలోఉంది. పట్టణ ప్రజలే కాకుండా సుదూర ప్రాంతాల భక్తులు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: కార్తీకమాసం పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ, తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభిస్తున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల డిపోల నుంచి వేములవాడ, అరుణాచలానికి, నిర్మల్ డిపో నుంచి వేములవాడకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. భక్తులు కోరుకుంటే ఇతర శైవక్షేత్రాలకు సైతం బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపో మేనేజర్‌ను సెల్‌నంబర్ 9959226002, మంచిర్యాల డీఎం సెల్ 9959226004, నిర్మల్ డీఎం సెల్ 9959226003, ఆసిఫాబాద్ డీఎం సెల్ 9959226006, భైంసా డీఎం సెల్ 9959226005 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


శివాలయం గర్భ గుడిలో అగస్త్య మహా ముని ప్రతిష్ఠించిన శివలింగం

మేలు జరుగుతుంది..



కార్తీక మాసంలో నియమ నిష్టలతో శివయ్యను ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. మాసంలో ఉదయం, సాయంత్రం వేళలో దీపారాధన నిర్వహించడం శుభప్రదం. ఆకాశ దీపం, దీపదానాలు, ఈ మాసానికి ప్రత్యేకత ఉంది. శివభక్తులు నెల రోజులపాటు కఠోర నియమ నిష్టలతో శివుణ్ని ఆరాధించడంతో మేలు జరుగుతుంది,

–వేమారం మహేశ్వర్‌శర్మ, అర్చకులు, చెన్నూర్

నదీ స్నానం



కార్తీక మాసం ఎంతో పవిత్రమైంది. ఈ మాసంలో నదిలో స్నానం, దీపదానం, శివకేశవులను దర్శించుకోవాలి. ఆలయాల్లో రుద్రాభిషేకం, హోమం, అభిషేకాలు చేయడం శివునికి ప్రీతికరం. ఉదయం నాలుగు గంటలలోపు నదిలో స్నానం ఆచరించడం, దీపారాధన చేయడం, దర్శించుకోవడంతో పుణ్యప్రాప్తి కల్గుతుంది. అభిషేకాలతో కైలాస వాసుడు ఎంతో సంతోషించి దైవప్రాప్తిని అనుగ్రహిస్తారు.

–శ్రీరాంభట్ల శశాంక్ శర్మ,అర్చకుడు

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



కార్తీక మాసంలో తెల్లవారుజామున స్నానం చేయడం మంచిది. మధుమేహ, హృద్రోగ రోగులు నది స్నానం, ఉపవాసం చేయడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యర్థాలు చేరిన నీటిలో స్నానం ఆచరించడం వల్ల వ్యాధులు సంభవించే అవకాశం లేకపోలేదు. చర్మవ్యాధులున్న వారు గోదావరిలో స్నానం చేసిన అనంతరం ఇంటికి వచ్చి మళ్లీ చేయాలి లేదా వెంటనే బయట షవర్స్ వద్ద కూడా స్నానం చేస్తే చర్మ సమస్యలను నివారించవచ్చు. స్నానం ఆచరించిన తర్వాత పొడిబట్టలు ధరించాలి. ఒకరి బట్టలు ఇంకొకరు ఉపయోగించరాదు.

–డాక్టర్, శ్రీధర్, చర్మవ్యాధ నిపుణులు, మంచిర్యాల

వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాలో గురు శుక్రవారాల్లో ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

తల్లిదండ్రులు మందలించారని


మహదు(ఫైల్)

ఇంద్రవెల్లి: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో ని వాల్గొండ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై సునీల్ తెలిపిన ప్రకా రం వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఉయిక జంగు-సుభద్ర దంపతుల చిన్న కుమారుడు మహదు(22) గురువారం సాయంత్రం మండల కేంద్రానికి వచ్చాడు. మద్యం తాగి రాత్రి ఇంటికి వెళ్లడంతో పండుగ పూట ఎందుకు తాగావని తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవా రుజమున ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో....

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో దూకి ఓ వ్యక్త శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన గోగుల సీతారాం(25) తన భార్యతో కలిసి కూలీపని నిమిత్తం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడలో నివాసముంటున్నాడు. వ్యక్తిగత కారణాలతో మూడు రోజులుగా ఇంటికి రావడం లేదు. శుక్రవారం ఉదయం స్థానికులకు చెరువులో మృతదేహం కనిపించగా.. పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి సీతారాంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధి దహిగూడ గ్రామానికి చెందిన మడావి సుపారి (25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుపారి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు జంగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ ప రిధి దుబ్బగూడ శివారులోని చెరువులో దూకి ప్రేందాస్ (50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండలం బట్టిసావర్‌గాం పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీలో నివాసం ఉంటున్న ప్రేందాస్ మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. గత నెల 30న మండలంలోని పిట్టల్‌వాడకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం పలుచోట్ల గాలించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం చెరువు వైపు బహిర్భూమికి వెళ్లిన దుబ్బగూడ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అక్కడ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందజేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు మిథున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనో వేదనతో మహిళ ..

సారంగపూర్: మనో వేదనతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆలూరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన రెంజర్ల లక్ష్మి(43) భర్త కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో లక్ష్మి బాగా కుంగిపోయింది. తన కుటుంబానికే ఇలా ఎందుకు అయిందో అని ఆనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఈనెల 30 క్రిమిసంహారక మందుతాగంది. గమనించిన ఆమె కుమారుడు సాయేందర్ తన బంధువుల సాయంతో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. లక్ష్మి కొడుకు సాయేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చెరువులో మునిగి యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీ చెరువులో మునిగి యువకుడు మృతిచెందాడు. నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన పవార్ నరేశ్ (25) గురువారం దీపావళి పండుగ కోసం తామర పువ్వులు తెస్తానని చెరువులో దిగాడు. పువ్వులు తెంపుతున్న క్రమంలో అందులోనే చిక్కుకుపోయాడు. బయటకురాలేక నీటిలో మునిగి మృతి చెందాడు. నరేశ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ చెప్పులు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కాలకృత్యాలకు వెళ్లి..


భావేశ్(ఫైల్)

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారు ఎర్రకుంట చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన శివన్నోల్ల భావేశ్(35)కు ఆరేళ్ల క్రితం పెళ్లయింది. సంతానం కలగకపోవడంతో భార్య విడిచి పెట్టి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించాడు. రాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లగా భావేశ్ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అక్క ఆయిటి భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు మృతి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన కొనేగర్ చిన్నన్న(48) నీటమునిగి మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చిన్నన్న పంట పొలానికి మందులు తెస్తానని మంగళవారం ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబీకులు ఆయన ఆచూకి కోసం గాలించినా కనిపించలేదు. గురువారం గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద చెరువులో శవమై కనిపించాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుకు ఢీకొని యువకుడు మృతి


ప్రవీణ్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సారసాల గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన తలండి ప్రవీణ్(22) గురువారం సెల్‌ఫోన్ రిపేర్ కోసం బైక్‌పై కాగజ్‌నగర్‌కు బయలుదేరాడు. కొత్త సారసాల వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. గాయపడిన ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం


ప్రతీక్ష (ఫైల్)

భైంసాటౌన్: కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన వివాహిత గిరి ప్రతీక్ష(24) తన నాలుగేళ్ల కూతురితో కలిసి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై ఎండీ.గౌసుద్దీన్ తెలిపారు. ప్రతీక్ష భర్త హరికృష్ణ పట్టణంలోని ఓ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. గురువారం పట్టణంలోని తన భర్త వద్దకు వచ్చిన ప్రతీక్ష కొంత డబ్బు తీసుకుని సామగ్రి కొనుగోలు చేసింది. అనంతరం గ్రామానికి వెళ్తున్నట్లు చెప్పి బస్టాండ్‌కు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మరో మహిళ సైతం ఆమె వెంట ఉంది. బాత్‌రూంకు వెళ్లి వస్తానని ప్రతీక్ష వెళ్లి ఎంతకీ రాలేదు. దీంతో భర్త హరికృష్ణకు సమాచారమివ్వగా, ఆయన బస్టాండ్‌కు వచ్చి ఆచూకీ కోసం గాలించాడు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


చిన్న భీమన్న (ఫైల్)

మామడ: పంటకు నీరందించేందుకు వెళ్లిన రైతును మృత్యువు విద్యుత్‌షాక్ రూపంలో కబళించింది. ఈ ఘటన మామడలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన రైతు రెడ్డి చిన్న భీమన్న(46) తాను సాగు చేస్తున్న పసుపు పంటకు నీరందించేందుకు బుధవారం వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గ్రామస్తులతో కలిసి రాత్రి చేను వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. విద్యుత్ స్తంభానికి ఉన్న సర్వీస్ వైరును సరిచేస్తుండగా షాక్‌కుగురై మృతిచెందినట్లు భావించారు. దీపావళి పండుగవేళ యజమాని మృతిచెందడతో విషాదం నెలకొంది. ఘటన స్థలాన్ని ఎస్సై సందీప్ సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి


నాగమ్మ(ఫైల్)

దండేపల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన గడ్డం నాగమ్మ(26) గురువారం పిడుగుపాటుకు మృతిచెందింది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగమ్మ గ్రామ శివారులోని పత్తి చేనులో పనికి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో వర్షం కురిసి పిడుగు పడింది. చేనులోనే కొద్ది దూరంలో పని చేస్తున్న ఆమె భర్త ప్రశాంత్ గమనించి గ్రామ శివారు వరకు ఎత్తుకొచ్చాడు. అక్కడి నుంచి 108అంబులెన్స్‌లో మేదరిపేటకు ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

- ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో కోచ్ రమేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో సత్తా చాటారు. కుమురంభీం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల(బాలికల) లో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో ఏకంగా 12 పతకాలను కై వసం చేసుకున్నారు. అండర్-14లో టి.స్వాతి 100 మీటర్ల విభాగంలో రజతం, అలాగే 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో కాంస్య పతకాలు సాధించింది. అండర్-17 విభాగంలో ఎస్. ఆనంది 400 మీటర్ల పరుగులో, ఎం.అమూల్య 800 మీటర్ల పరుగులో, ఎస్. స్ఫూర్తి రేస్ వాక్‌లో, ఎస్.రక్షిత డిస్కస్ త్రోలో స్వర్ణ పతకాలతో మెరిశారు. అలాగే ఎం.శివాని రేస్ వాక్‌లో, టి. మానస 1500 మీటర్ల విభాగంలో రజత పతకాలు సాధించారు. ఎన్.వర్షిని 200 మీటర్ల పరుగులో, బి.శృతి జావెలిన్ త్రోలో, పి.కావ్య హైజంప్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని కోచ్ రమేశ్ తెలిపారు. జోనల్ స్థాయి పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. అండర్-14 రాష్ట్రస్థాయి పోటీలు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-17 పోటీలు సైతం త్వరలో ఉంటాయని పేర్కొన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై పలువురు క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

జిల్లాకు చెందిన అథ్లెట్లు ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో షాట్‌పుట్‌లో కాజోల్ స్వర్ణం, అలేఖ్య హైజంప్‌లో రజతం, 600 మీటర్లు, 400 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో మెరిశారు. అండర్-17 విభాగంలో వైష్ణవి లాంగ్ జంప్‌లో కాంస్యం సాధించినట్లు కోచ్ రాకేశ్, మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. జోనల్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి అభినందించారు.

పండుగ పూట విషాదం

- నదీ స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతు
- మృతదేహాలు లభ్యం



అరుణ్‌కుమార్(ఫైల్), దాసరి సాయి(ఫైల్)

చెన్నూర్‌రూరల్: దీపావళి పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుందామని ఇద్దరు విద్యార్థులు స్వగ్రామానికి వచ్చారు. కానీ నదీ స్నానం రెండు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెందిన కొండ అరుణ్‌కుమార్ (19), దాసరి సాయి(16) సుందరసాల వద్ద (అన్నారం బ్యారేజి) గోదావరి నదిలో గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్నెపల్లికి చెందిన అరుణ్‌కుమార్ తన తల్లిదండ్రులు కొండ పోచయ్య, శోభతో చెన్నూర్‌లో నివాసం ఉంటున్నాడు. కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దాసరి సాయి తల్లిదండ్రులు దాసరి కృష్ణ, మధులతతో రామగుండంలో నివాసం ఉంటున్నాడు. కరీంనగర్‌లోని ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వీరు గురువారం దీపావళి పండుగకు స్వగ్రామం దుగ్నెపల్లికి వచ్చారు. శుక్రవారం అరుణ్‌కుమార్, సాయి నలుగురు స్నేహితులతో కలిసి సుందరసాల గ్రామ సమీపంలోని గోదావరి నదికి స్నానానికి వెళ్లారు. అన్నారం బ్యారేజీ గేట్లు తీసి ఉండడంతో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. వీరు ఈత కొడుతున్న సమయంలో గోదావరిలో గల్లంతయ్యారు. వెంటనే మిగతా స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అమ్మానాన్న విడిపోయారని..

- ఆత్మహత్య చేసుకున్న కొడుకు
- పండుగపూట కుంటాలలో విషాదం..


రామ్ చరణ్ మృతదేహం

కుంటాల: ఆ విద్యార్థి వయసు 14 ఏళ్లు.. కొన్నేళ్లుగా అమ్మానాన్న గొడవ పడుతుండడంతో చదవుపై దృష్టిపెట్టలేకపోయాడు. ఈ క్రమంలో తల్లిదండ్రుల గొడవలు ఎక్కువ కావడంతో ఇద్దరూ విడిపోయారు. దీంతో మరింత కుంగిపోయాడు. ప్రస్తుతం తల్లితో కలిసి ఉంటున్న అతను దీపావళి పండుగ రావడంతో అమ్మానాన్న వేరుగా ఉండడంతో మనస్తాపం చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన కుంటాల మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన కవితకు గత 16 ఏళ్ల క్రితం పెంబి మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ శ్రీనివాస్ తో వివాహం జరిగింది. మామ డ మండలం కిసాన్‌రావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్ తండాలో స్థిరపడ్డా రు. తరచూ భార్యాభర్తల మ ధ్య గొడవలు జరగడంతో కొన్నేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. కవిత కుంటాలలో ఉంటూ కూతురిని భైంసాలో ఇంటర్, కుమారుడు రాథోడ్ రామ్‌చరణ్ (14)ను కుంటాల ఉన్న త పాఠశాలలో 9వ తరగతి చదివిస్తోంది. తల్లిదండ్రులు ఇక కలిసి ఉండరన్న బెంగతో రాథోడ్ రామ్‌చరణ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. పండుగపూట కన్న కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. కవిత ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు.